సాక్షి
బాపట్ల
మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



## యార్డుకు 1,63,393 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,63,393 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,43,296 బస్తాలు అమ్మకాలు జరిగాయి.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 537.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు పదివేల క్యూసెక్కులు విడుదలవుతోంది.

## వైభవంగా ఆలయ వార్షికోత్సవం



తెనాలి టౌన్: కొలకలూరులోని పంచముఖ గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం చండీ హోమం, శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## న్యూస్‌రీల్

### జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష



నరసరావుపేటటౌన్: మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి సోమవారం స్థానిక న్యాయస్థాన భవనాల ఆవరణలో పోలీసు అధికారులతో న్యాయమూర్తులు సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 8న స్థానిక న్యాయస్థానం భవనాలు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు స్థానిక అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు అధికారులకు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి చట్టపరమైన అంశాలను వివరించారు. పోలీసులు కేసులు పరిష్కారానికి సంబంధించి లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్, వన్‌టౌన్ ఎస్‌ఐ అరుణ, టూటౌన్ ఎస్‌ఐ లేఖ ప్రియాంక, రొంపిచర్ల ఎస్‌ఐ మణి కృష్ణ , నకరికల్లు ఎస్‌ఐ సిహెచ్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు

### ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన వల్లభనేని సాయిప్రసాద్‌రెడ్డి, సరోజిని దంపతులు రూ.5,01,116లు విరాళంగా అందజేశారు. ఆలయంలో సోమవారం ఈఓ ఎన్.మాధవిలతను కలిసి దాతలు విరాళం చెక్కును అందించారు. తమ తల్లిదండ్రులు కబీర్‌దాస్, రాజమ్మ జ్ఞాపకార్థం విరాళాన్ని అందజేసినట్టు దాతలు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని ఈఓ కోరారు. కార్యక్రమంలో నంద్యాల దామోదరరెడ్డి, సుబ్రహ్మణ్యం, శేఖర్ పాల్గొన్నారు.

### రైతు బజార్లలో కూరగాయల రైతులకు అవకాశం

నరసరావుపేట: కూరగాయలు పండించే రైతులు వారి ఉత్పత్తులను రైతుబజార్లలో విక్రయించుకునేందుకు అవకాశం కల్పిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందిపడే రైతులు మండల ఉద్యానవనశాఖ, మార్కెట్ కమిటీ కార్యదర్శులను సంప్రదించాలని కోరారు. వారు జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారికి వివరాలు తెలియచేసి రైతు బజార్లలో విక్రయించుకునే అవకాశం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 91823 61451 నంబరులో సంప్రదించాలని కోరారు.

### త్రికోటేశ్వరునికి బంగారు రుద్రాక్షలు బహూకరణ



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారికి నాదెండ్ల మండలం కమ్మవారిపాలెంకు చెందిన భక్తుడు చంద్ర శ్రీనివాసరావు రూ.16లక్షల విలువైన బంగారు రుద్రాక్షలను బహూకరించాడు. ఆలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా బంగారు రుద్రాక్షలను ఆలయ అర్చకులకు అందజేశారు. ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు.

**ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలి**

తిరునాళ్ల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని సోమవారం ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. తిరునాళ్లకు తక్కువ సమయం ఉన్న దృష్ట్యా పనులు వేగవంతం చేసి పూర్తిచేయాలని సూచించారు. మహాశివరాత్రి రోజున కోటప్పకొండకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.

# చెరువును చెరబట్టారు

- ధర్మవరం పెద్ద చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలింపు
- బెంగళూరు – అమరావతి ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి సరఫరా
- విద్యుత్ మంత్రి ఇలాకాలో ఆగని గ్రావెల్, మట్టి దందా
- రియల్ వెంచర్లకూ ఇక్కడి నుంచే సరఫరా



ధర్మవరం చెరువు నుంచి యంత్రాలు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలించిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సొంత నియోజకవర్గం అద్దంకి ప్రాంతంలో పచ్చ నేతలు మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు గుండ్లకమ్మ నది నుంచి ఇసుక, మరికొందరు నియోజకవర్గంలో ఇసుకతోపాటు గ్రావెల్, మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరంతా మంత్రి అనుచరులు కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అద్దంకి మండలం ధర్మవరంకు చెందిన పచ్చనేత ధర్మవరం పెద్ద చెరువు నుంచి గ్రావెల్ తరలించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. 113 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో సుమారు పదికి పైగా యంత్రాలతో వంద టిప్పర్ల ద్వారా మట్టి తరలించి అమ్ముకుంటున్నారు. రేయింబవళ్లు అక్రమ రవాణా సాగుతోంది.

**తాజాగా అద్దంకి నియోజకవర్గంలో ...**

బెంగళూరు – అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లా తాళ్లూరు ప్రాంతం నుంచి అద్దంకి నియోజకవర్గం ముప్పవరం వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. చెరువు నుంచి రోజుకు వందలాది టిప్పర్ల మట్టి, గ్రావెల్‌ను హైవేకు తరలిస్తున్నారు. దీంతోపాటు అద్దంకి నియోజకవర్గంలోని రియల్ వెంచర్లు, ఇతర అవసరాలకు ధర్మవరం చెరువు నుంచే గ్రావెల్ తరలిస్తున్నారు. ఒక టిప్పర్ గ్రావెల్‌కు హైవే కాంట్రాక్టర్లు రూ.ఐదు వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన రాబడి రోజుకు రూ.లక్షల్లో ఉన్నట్లు అంచనా.

**తరలింపు వేగవంతం ..**

గ్రావెల్, మట్టి రవాణాపై 'సాక్షి'లో కథనం రావడంతో తరలింపును కొద్ది రోజులు నిలిపి, ఇప్పుడు మళ్లీ వేగవంతం చేశారు. చెరువు నుంచి మట్టి లేదా గ్రావెల్ తరలించాలంటే నిబంధనల మేరకు నీటిపారుదల శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. అయితే తనకు అనుమతులు ఉన్నట్లు సదరు నేత బుకాయిస్తున్నట్లు సమాచారం. వాస్తవంగా అనుమతులు ఉంటే రోజువారీ తరలిస్తున్న మట్టి, గ్రావెల్ వివరాలు, ప్రభుత్వానికి ఎంత మొత్తం చెల్లించారో కూడా తెలియజేయాలి. ఆ వివరాలు అధికారులకు ఇచ్చిన దాఖలాలు కనిపించడంలేదు. నియోజకవర్గంలో పలు చెరువులు ఉన్నా ఆయా గ్రామాల ప్రజలు గ్రావెల్, మట్టి అక్రమ తరలింపుకు అంగీకరించలేదని తెలుస్తోంది. తొలుత ఇదే మండలంలోని కలవకూరు, శింగరకొండ తదితర గ్రామాల చెరువుల నుంచి గ్రావెల్ తరలించేందుకు పచ్చనేతలు ప్రయత్నించగా గ్రామస్తులు అంగీకరించలేదు. ముళ్ల కంపలు, ఇతర చెట్లు ఉన్న ధర్మవరం చెరువును ఆధునీకరించాల్సిన అధికారులు, పచ్చనేతలు కుమ్మక్కై మట్టి, గ్రావెల్ అమ్మకానికి పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- డ్రైవర్ మృతి, ఐదుగురు కూలీలకు గాయాలు
- కారంచేడులో రొంపేరు కాలువ వద్ద ఘటన



ప్రమాదంలో మృతి చెందిన పోతురాజు



రొంపేరు కాలువలోకి దూసుకుపోయిన ట్రాక్టర్

కారంచేడు: వ్యవసాయ పనుల నిమిత్తం తమ యజమాని పొలంలోని ధాన్యం బస్తాలను ఇంటికి తోలేందుకు కూలీలతో పొలానికి బయలుదేరిన వ్యక్తి అకాల మరణం చెందాడు. కారంచేడు ఎస్‌ఐ వి.వెంకట్రావు, ప్రత్యక్ష సాక్షుల వివరాల మేరకు.. మండల కేంద్రం కారంచేడు అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన గర్నెపూడి పోతురాజు (51) సోమవారం తమ యజమాని ఇంటి నుంచి ట్రాక్టర్ తీసుకొని వ్యవసాయ కూలీలతో ధాన్యం బస్తాలు తీసుకురావడానికి పొలానికి బయలుదేరాడు. వాడరేవు–పిడుగురాళ్ల ప్రధాన రహదారిలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో కల్యాణ మండపం ఎదురుగా ఉన్న రొంపేరు కాలువపై నిర్మించిన వంతెన ఎక్కే క్రమంలో అదే వంతెనపై ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి ట్రాక్టర్ అదుపు తప్పింది. దీంతో ఒక్కసారిగా కాలువలోని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టిన ట్రాలీలో ఉన్న వ్యసాయ కూలీలు చాకచక్యంగా కిందికి దూకేశారు. ఇంజిన్‌లో ఉన్న పోతురాజుకు కిందకు దూకే అవకాశం లేక నీళ్లలో పడిపోయాడు. నీటిలో ఉన్న పోతురాజును వ్యవసాయ కూలీలు బయటకు తీశారు. అక్కడకు చేరుకున్న మరికొందరితో కలసి సీపీఆర్ చేశారు. 108 వాహనాన్ని పిలిపించి వెంటనే చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పోతురాజు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య లూర్దు, కుమారులు ఏసు రాజు, గాబ్రియేలు ఉన్నారు.

**కంటతడి పెట్టించిన మృతుడి భార్య రోదన**

కూలి పనులు చేసుకుంటే గాని పూట గడవని పేద కుటుంబం పోతురాజుది. అనారోగ్యంతో ఉన్న భార్యను చిన్నచిన్న పనులకు మాత్రమే పంపించేవాడు. తానే అన్నీ అయి బిడ్డలను చదివించుకుంటూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పోతురాజు మృతితో కుటుంబ సభ్యులు దిక్కులేనివారయ్యారు. మాకు దిక్కెవరయ్యా అంటూ మృతుడి భార్య లూర్దు రోదిస్తున్న తీరు చూపరులచే కంటతడి పెట్టించింది.

## దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి, ఇద్దరికి గాయాలు



ప్రమాద తీవ్రతకు ధ్వంసమైన కారు



మృతి చెందిన జూలూరు శ్రీకృష్ణ

మార్టూరు: దైవ దర్శనం చేసుకుని తిరిగి వెళ్తుండగా ఇంటికి చేరకుండానే ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈఘటన మార్టూరు 16వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగింది. హైవే అంబులెన్స్ సిబ్బంది రవి, స్థానికుల వివరాల మేరకు.. జూలూరు శ్రీకృష్ణ (40), జూలూరు వంశీకృష్ణ, కె.వివేక్‌లు తిరుపతి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరిగి నూజివీడుకు కారులో బయలుదేరారు. సరిగా ఉదయం సుమారు 7 గంటల ప్రాంతంలో స్థానిక దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలో వీరి వాహనం అదుపుతప్పి మొదట ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టి అనంతరం డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాద ధాటికి కారు తీవ్రంగా ధ్వంసం కాగా అందులో ఉన్న ముగ్గురిలో జూలూరు శ్రీకృష్ణ (40) ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మిగిలిన వంశీకృష్ణ, వివేక్‌లు గాయాలతో బయటపడ్డారు. 108 సిబ్బంది క్షతగాత్రులను చిలకలూరిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# 'ప్రకృతి'తో ఆరోగ్యకర పంటలు

**ప్రకృతి వ్యవసాయం జిల్లా అడిషనల్ డీపీఎం మోహన్**

యద్దనపూడి: ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే వనరులను వినియోగించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ప్రకృతి వ్యవసాయశాఖ అడిషనల్ డీపీఎం మోహన్ అన్నారు. సోమవారం మండలంలోని పూనూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌పీఎం (పురుగు మందులు లేని వ్యవసాయం) దుకాణం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విచక్షణ రహితంగా ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల ప్రస్తుతం భూసారం క్షీణించి గాలి, నీరు కలుషితమవటంతో పాటు ప్రజలు అనారోగ్యంతో బాధపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీని నివారణకు ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఇంటిలో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకొని ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు పండించుకొని ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. ఎన్ఎఫ్ఏ శ్రీనివాసరావు, ఎన్‌పీఎం మాస్టర్ ట్రైనర్ భీమరాజులు మాట్లాడారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారు చేసిన కషాయాలను పరిశీలించారు. మాస్టర్ ట్రైనర్ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి మేరమ్మ, హోమియో వైద్యాధికారి గుర్రం అంజమ్మ, మండల సమైఖ్య అధ్యక్షురాలు బత్తుల కృష్ణవేణి, ఎల్‌టూలు వెంకటరత్నం, కోటిబాబు, మోడల్ మేకర్ నాగరాజు, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.



ఎన్‌పీఎం దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఏడీపీఎం మోహన్, అధికారులు

# ట్రాక్టర్ అడ్డుపెట్టి దౌర్జన్యం



రాకపోకలకు వీలులేకుండా రోడ్డుకు అడ్డంగా పెట్టిన ట్రాక్టర్

- రాకపోకలకు తీవ్ర ఆటంకం
- బల్లికురవ మండలం అంబడిపూడి గ్రామంలో టీడీపీ నేత దాష్టీకం



రోడ్డుకు అడ్డంగా తోలిన మట్టికుప్ప

బల్లికురవ: కూటమి ప్రభుత్వంలో టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. గ్రామ పంచాయతీ రోడ్డుపై ఏకంగా ట్రాక్టర్ అడ్డుపెట్టి రాకపోకలకు ఇబ్బందులు సృష్టించారు. ఫిర్యాదు చేసినా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం వారి 'పచ్చ'పాతానికి నిదర్శనంగా మారింది.

- వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని అంబడిపూడి గ్రామ పంచాయతీలోని చిన అంబడిపూడి గ్రామంలోని బీసీ కాలనీలో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి సర్పంచ్ మందలపు శ్రీలక్ష్మి, బుజ్జి ఆనందరావు ఇంటినుంచి పల్లపు రామకృష్టారావు ఇంటివరకు సిమెంట్ రోడ్డు వేశారు. నిధుల లేమితో సైడు కాలువల పనులు నిలిచాయి. ఈ రోడ్డులోని టీడీపీ నాయకుడు మన్నం శ్రీను తన ఇంటిముందుకు మురుగు నీరు వస్తుందంటూ రోడ్డుపై మట్టికుప్పలు తోలి రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ ట్రాక్టర్‌ను అడ్డుపెట్టాడు. దీంతో స్థానికంగా ఉండే బాధితులు పల్లపు రామకృష్టారావు, వెంకటరావు, వెంకటరమణ, శారద, మహేష్‌బాబులు ఇప్పటికే రెండు పర్యాయాలు గ్రీవెన్స్‌లో తహసీల్దార్ రవినాయక్‌కు, ఎంపీడీఓ కుసుమ కుమారికి ఫిర్యాదు చేశారు. ఇదంతా మనసులో పెట్టుకున్న మన్నం శ్రీను నాపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ గొడవలకు దిగడంతో ఫిర్యాదుదారులు ఐదుగురితో పాటు మన్నం శ్రీను ఆయన భార్య భూలక్ష్మిని జనవరి 23న తహసీల్దార్ వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా బైండోవర్ చేశారు. అయితే సమస్య మాత్రం పరిష్కారం కాలేదని తమ ఇంటి ముందు రోడ్డులో నడిచి వెళ్లలేకపోతున్నామని బాధితులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని రోడ్డుకు పెట్టిన అడ్డంకులను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని బాధితులు కోరుతున్నారు.

# జీబీ సిండ్రోమ్‌పై అవగాహన కల్పించండి

**జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: గులియన్ బ్యారి(జీబీ) సిండ్రోమ్ వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ వ్యాప్తిని అరికట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా చేపట్టిన అభా కార్డుల నమోదు ప్రక్రియ, జీబీ సిండ్రోమ్ వ్యాధి వ్యాప్తిపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీడియో సమావేశం నిర్వహించారు. ప్రాణాంతకమైన జీబీ సిండ్రోమ్ వ్యాధికి జిల్లా వాసులు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలోని విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. బ్యాక్టీరియా సోకి వ్యాధిగ్రస్తులైన వారికి ప్రభుత్వం ప్రత్యేక వైద్యం అందిస్తుందని కలెక్టర్ చెప్పారు. గుంటూరు జీజీహెచ్‌లో, ప్రకాశం జిల్లా ఒంగోలు రిమ్స్‌లో ప్రత్యేక కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అభా కార్డుల నమోదు ప్రక్రియ పది రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. జిల్లాలో కిడ్నీ డయాలసిస్ కేసులు 1010 ఉన్నాయని, నూతనంగా డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు తక్షణమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. డీఆర్ఓ జి.గంగాధర్ గౌడ్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చేనేతల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరచాలి..

బాపట్ల: చేనేత కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. చేనేత కుటుంబాల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ముద్ర పథకం కింద చేనేత కుటుంబాలకు చేయూత అందించేందుకు 1,044 మందికి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు 76 మందికి మాత్రమే ఆయా బ్యాంకుల ద్వారా రుణాలు అందాయని తెలిపారు. జిల్లాలో చీరాల, వేటపాలెం, భట్టిప్రోలు, చెరుకూరు, రేపల్లె, మార్టూరు మండలాల్లో నేత కార్మికుల కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, వీరిని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు, ఎల్‌డీఎం కలసి వ్యక్తిగతంగా వెళ్లి వారితో చర్చించి రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు నాగమల్లేశ్వరరావు, ఎల్‌డీఎం శివకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

**రూ.2.40 లక్షల విలువైన 24 కిలోల గంజాయి పట్టివేత**



నగరంపాలెం: ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో సోమవారం ట్రైనీ ఐపీఎస్ దీక్ష, జిల్లా ఏఎస్పీ కె. సుప్రజ (క్రైం)తో కలిసి కేసు వివరాలను ఆయన తెలిపారు. గుంటూరు రూరల్ మండలం శివారెడ్డిపాలెం పోలేరమ్మ గుడి సమీపాన ఉంటున్న దమ్మాలపాటి మణికంఠ ఏడో తరగతి వరకు చదివాడు. చెడు అలవాట్లకు బానిసయ్యాడు. బేల్దారి పనులతో పాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లేవాడు. గతేడాదిలో వైజాగ్ వెళ్లి, తిరుగు ప్రయాణంలో తునిలో దిగి, గంజాయి ఎక్కడ విక్రయిస్తారని వాకబు చేశాడు. అనంతరం విశాఖపట్నం జి.మడుగు మండలం పెద్ద కిల్తారికి చెందిన చింతల సత్యనారాయణ అలియాస్ సతీష్‌తో పరిచయమైంది. దీంతో రూ.10 వేలకు రెండు కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. అక్కడ నుంచి ప్రతిసారి బస్‌లో వెళ్లి, రైళ్ల ద్వారా గుంటూరుకు గంజాయి తెచ్చేవాడు. యాభై గ్రాములు సంచులను రూ.500కు విక్రయించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట చింతల సత్యనారాయణకు ఫోన్ చేసి భారీగా గంజాయి కావాలని అడిగాడు. దీంతో సత్యనారాయణ భార్య చింతల పద్మ 24 కిలోల గంజాయిని సోమవారం మణికంఠ నివాసానికి తీసుకువచ్చింది. ముందస్తు సమాచారంతో మణికంఠను, చింతల పద్మను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2.40 లక్షల ఖరీదు చేసే 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సతీష్‌ను త్వరలో పట్టుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# పోలీసుల తీరుతో ఆత్మహత్యాయత్నం

- కొడుకు చేతిలోని పురుగుల మందు డబ్బా లాక్కొని తాగిన తల్లి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు



చికిత్స పొందుతున్న షేక్ గాలిబ్ బీ



రాత్రిళ్లు పసి పాపతో స్టేషన్ వద్ద కూర్చున్న ఇమామ్ చెల్లెలు

జె.పంగులూరు: పోలీసుల వేధింపులు భరించలేక వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన కొడుకు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా ఆ డబ్బా లాక్కొని తల్లి తాగిన ఘటన బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం అలవలపాడులో సోమవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు.. రెండేళ్ల క్రితం అలవలపాడు గ్రామానికి చెందిన షేక్ ఇమామ్, అతని భార్య సల్మా కుటుంబ కలహాలతో విడిపోయారు. వారికి 18 నెలల పాప ఉంది. షేక్ ఇమామ్ తన భార్య తనవద్దకు రావాలని పెద్ద మనుషులను పిలిపించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక చట్టపరంగా విడాకులు కావాలని కోరాడు. దీంతో సల్మా తనను గృహహింస చేస్తున్నారంటూ భర్త, అత్త మరికొందరిపై రేణింగవరం స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇమామ్ కుటుంబం మొదటి నుంచి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులుగా ఉండేవారు. ఈ కేసును ఆసరాగా చేసుకుని కొందరు టీడీపీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తేవడంతో ఇమామ్ కుటుంబంతో సంబంధం లేని మరో తొమ్మిది మందిపై రేణింగవరం ఎస్‌ఐ వినోద్‌బాబు 498 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ప్రతి రోజూ తొమ్మిది మందిని ఎస్‌ఐ స్టేషన్‌కి పిలిపించి వేధిస్తున్నారు. అంతటితో ఆగకుండా సోమవారం ఎస్‌ఐ తనతో దురుసుగా ప్రవర్తించారని, 'నీ భార్య బంగారం ఆమెకు ఇచ్చేయి. లేకుంటే నీపై దొంగతనం కేసు నమోదు చేస్తా.. నీ కుటుంబాన్ని రోడ్డు కీడుస్తా..బంగారాన్ని సీజ్ చేస్తా.. జీవితంలో బయటకు రాకుండా చేస్తా..' అంటూ దురుసుగా మాట్లాడాడని బాధితుడు ఇమామ్ వాపోయాడు. ఎస్‌ఐ మాటలు భరించలేక పురుగుల మందు తాగి చనిపోదామని తెచ్చుకుంటే.. ఆ మందు డబ్బాను లాక్కొని ఇమామ్ తల్లి గాలీబ్‌బీ తాగింది. ఆమెను హుటాహుటిన అద్దంకి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయంలో ప్రమేయం లేని తన చెల్లెలిని పసిపిల్ల తల్లి అని కూడా చూడకుండా రాత్రిళ్లు స్టేషన్‌కు పిలిపించి టార్చర్ పెడుతున్నారని బాధితుడు కన్నీటిపర్యంతం అయ్యాడు. ఈ విషయమై ఎస్‌ఐను వివరణ కోరగా దంపతుల మధ్య సఖ్యత కుదిర్చేందుకు ఇద్దరినీ పిలవగా, సల్మా స్టేషన్‌కు వచ్చేందుకు ఇష్టపడటం లేదని, కోర్టులో ఈ వ్యవహారం తేల్చుకోమని చెప్పడం మాత్రమే జరిగిందని తెలిపారు.

క్లుప్తంగా

## మహాశివరాత్రి తిరునాళ్లకు ముస్తాబు



**అమర్తలూరు (వేమూరు):** మహాశివ రాత్రి తిరునాళ్లకు బాల కోటేశ్వర స్వామి దేవస్థానం ముస్తాబు అవుతోంది. ఈ తిరునాళ్లకు భక్తజనం పెద్ద సంఖ్యలో తరలివస్తారు. వారందరికీ స్వామివారి దర్శనానికి సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, దేవస్థానం కార్య నిర్వహణాధికారి అశోక్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దేవస్థానానికి రంగులు వేస్తున్నారు. భక్తులు దేవుని దర్శనం కోసం క్యూలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన మహాశివరాత్రికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మరమ్మతులు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## ఐదు, ఇంటర్ తరగతుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**అచ్చంపేట:** స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతుల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవలసినదిగా పాఠశాల/కళాశాల ప్రిన్సిపల్ అరుణకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు ఇంగ్లిష్ మీడియంలో ఉంటాయని పేర్కొన్నారు. ఐదో తరగతికి 80 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపునకు 40 సీట్లు, బైపీసీ గ్రూపునకు 40సీట్లు ఉంటాయని వివరించారు. కుల రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తామని, ఏప్రిల్ 6, 20025 తేదీలోపు htt p://a pbrafcet.apcfrr.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పంపుకోవలసి ఉంటుందని వివరాలకు 9059 660634 తెలుసుకోవచ్చనన్నారు.



# సర్వేను అడ్డుకున్న పచ్చమూకలు

- నడకదారి వివాదంలో ప్రభుత్వ సర్వే అడ్డగింత
- కొలతలు సేకరించవద్దంటూ పట్టు
- రికార్డుల ప్రకారం కొలతలు సేకరించాలని పేద రైతు మొర
- ఇరు వర్గాల నడుమ వివాదంతో సర్వే నిలిపివేసిన యంత్రాంగం



సర్వేను అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు, హద్దులు నిర్ధారించాలని కోరుతున్న బాధిత రైతు వర్గీయులు

**కొల్లూరు:** టీడీపీ వర్గీయులు అడ్డగింత కారణంగా వివాదాస్పదంగా మారిన నడకదారి హద్దుల వ్యవహారం సర్వే జరగకుండానే నిలిచిపోయింది. మండలంలోని జువ్వలపాలెం శివారు గుంటూరుగూడెంలో టీడీపీకి చెందిన పక్క పొలం రైతు తన పంట పొలంలోని మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి బలవంతంగా తన భూమిని ఆక్రమించుకున్నాడని మారీదు ప్రసాద్ అనే రైతు ఆరోపించాడు. గుంటూరుగూడెంకు చెందిన రైతు ప్రసాద్ ఈ వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగంను సైతం సంప్రదించి సర్వే చేయించి న్యాయం చేయాలని అప్పట్లోనే వినతి పత్రం రూపంలో మొరపెట్టుకున్నాడు.

ఈనెల 4న 'సాక్షి'లో 'పేద రైతుపై దౌర్జన్యకాండ' శీర్షికతో కథనం సైతం వెలువడింది. సమస్యను పరిష్కరించేందుకు బాధిత రైతును ప్రభుత్వ సర్వేకు దరఖాస్తు చేసుకోవాలని కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు సూచించడంతో వారు అధికారిక సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రవేటు సర్వేయర్లతో టీడీపీకి చెందిన నాయకుడు వేములపల్లి రవికిరణ్ కొలతలు కొలిపించి తనపై దౌర్జన్యానికి పాల్పడి తమపై దాడి చేయించి పొలం ఆక్రమించుకోవడంతో పాటు, నష్టం కలిగించారన్న బాధితుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ప్రభుత్వ సర్వేయర్లు కొలతలు సేకరించాలని ఆదేశించడంతో సోమవారం కొలతల ప్రక్రియ కోసం సర్వేయర్లు వివాదాస్పద భూమి వద్దకు వెళ్లారు. ఈనేపథ్యంలో బాధిత రైతులు తమ వద్దనున్న పత్రాలను అందజేసి దాని ప్రకారం తమ హద్దులు నిర్ణయించాలని సర్వేయర్లను కోరారు. టీడీపీ నాయకుడు వర్గీయులు మాత్రం మొత్తం భూమికి కొలతలు సేకరించడానికి ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని, బాధిత రైతు పేర్కొంటున్న 2 సెంట్ల భూమి తమకు చెందినదని కొలతల సేకరణను అడ్డగించారు. ఒక దశలో బాధిత రైతుల పక్షాన నిలిచి సామరస్యంగా సమస్యను పరిష్కరించేందుకు వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులపైన సైతం దురుసుగా వ్యవహరిస్తూ వివాదం సృష్టించారు. దీంతో భూమి హద్దులు నిర్ధారించేందుకు వెళ్లిన సర్వేయర్లు టీడీపీ నాయకులు వివాదంలో ఉన్న 2 సెంట్ల భూమి కొలిసేందుకు ఒప్పుకునేది లేదని పట్టుపట్టడంతో సాయంత్రం వరకు వేచి చూసి వెనుతిరిగారు. బాధిత రైతు పక్షాన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుగ్గున మల్లేశ్వరరావు వివాదాస్పదమైన భూమి వద్దకు వెళ్లి కొలత ప్రక్రియ చట్టబద్ధంగా నిర్వహించాలని సర్వేయర్లను కోరారు.

### లింక్ డాక్యుమెంట్లతో సమస్య పరిష్కరిస్తాం

నడక దారి వివాదంలో తన వద్ద ఉన్న పత్రాల మేరకు 1.06 సెంట్లకు కొలతలు నిర్వహించి హద్దులు నిర్వహించాలని బాధిత రైతు సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే పక్క రైతు సైతం తమ పత్రాల మేరకు ఆభూమి తమకు చెందుతుందని వెల్లడించడంతో కొలతల సేకరణను నిలుపుదల చేయాల్సి వచ్చింది. ఆ భూములకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు, ఇతర పత్రాలను సైతం తీసుకురావాలని ఇరుపక్షాలకు సూచించి తిరిగి కొలతలు నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

–బి. వెంకటేశ్వర్లు, తహసీల్దార్, కొల్లూరు.

## కాజ టోల్ ప్లాజాను రద్దుచేయాలి



మాట్లాడుతున్న నన్నపనేని

**మంగళగిరి టౌన్:** మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని అధిక టోల్‌ఫీజు వసూలు చేస్తున్న కాజ టోల్‌ప్లాజాను వెంటనే రద్దు చేయాలని ప్రయాణికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ బాల వెంకటరావు, ప్రధాన కార్యదర్శి నన్నపనేని నాగేశ్వరరావు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కాజ టోల్‌గేట్ వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 79 కిలోమీటర్ల దూరంలో టోల్‌ప్లాజా ఉండకూడదని దీనిపై లారీ ఓనర్స్ మౌనం ఎందుకు వహిస్తున్నారని ప్రశ్నించారు. గతంలో రూ.150 ఉండే టోల్‌పాస్ ఇప్పుడు రూ.340 చేశారని దీనిపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. గుంటూరు, విజయవాడ మధ్యలో ఉన్న ఈ టోల్‌గేటును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ నెట్ వర్క్‌లో ఏఐ ఆధారిత పరిష్కారాలపై సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ రామ్మోహన్

**పెదకాకాని:** వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఎనర్జీ డిస్ఎగ్రిగేషన్ ఏఐ బేస్డ్ సొల్యుషన్ మెథడ్స్ అండ్ అప్లికేషన్స్ అంశంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా సౌత్ కొరియా నేషనల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రామ్మోహన్ మల్లిపెద్ది హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎనర్జీ డిస్ఎగ్రిగేషన్ పద్ధతి అంటే కరెంట్ మీటర్ నుంచి కరెంటు పరికరాల శక్తి వినియోగాన్ని వేరు చేసే ఓ టెక్నిక్ అని తెలిపారు. శక్తి వినియోగంలో ఆధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఉపకరణాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో విశ్లేషించవచ్చని దాని ద్వారా ఉపకరణాల పనితీరును మెరుగుపరుచుకోవడం శక్తి వినియోగాన్ని తగ్గించుకోవడం చేయవచ్చన్నారు. ఉపకరణాల వినియోగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా పనితీరుకు సరిపడా శక్తిని అందించబడుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ సరేష్ బాబు, డాక్టర్ సీహెచ్ నాగసాయి కళ్యాణ్ పాల్గొన్నారు.

## విజ్ఞాన్‌లో డ్రోన్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం



డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న విద్యాసాగర్

**చేబ్రోలు:** వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో డ్రోన్ టెక్నాలజీ సెంటర్(సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ అటానమస్ సిస్టమ్స్)ను హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.విద్యాసాగర్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్ వలన విద్యార్థులకు డ్రోన్ డిజైన్, ప్రోగ్రామింగ్, డ్రోన్ల వినియోగంపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. టెక్నాలజీలో హ్యాండ్స్- ఆ అనుభవం కల్పించేందుకు ల్యాబ్ సౌకర్యాలు, విద్యాపరమైన కోర్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డ్రోన్ టెక్నాలజీ, ఆటోనమస్ నావిగేషన్, రిమోట్ సెన్సింగ్‌పై ప్రత్యేక కోర్సులను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు.

విద్యార్థులకు పరిశ్రమ నిపుణులతో వర్క్‌షాప్‌లు, సెమినార్లు, అతిథి ఉపన్యాస కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు కొత్త డ్రోన్ ఆధారిత స్టార్టప్‌లను ప్రారంభించేందుకు మద్దతు అందిస్తామని వివరించారు. పరిశ్రమలతో కలిసి కొత్త డ్రోన్ సొల్యూషన్ల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. డ్రోన్‌స్‌టెక్నాలజీలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో సహకారానికి తోడ్పాటుపడతామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. డ్రోన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామింగ్‌పై పోటీలు నిర్వహించడం, డ్రోన్‌పై పై కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించే కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఈ డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు విజ్ఞాన్ యూనివర్సిటీల సంయుక్త ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.



## క్వారీ తిరునాళ్లకు సకల సౌకర్యాలు


తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా



మాట్లాడుతున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా

**చేబ్రోలు:** మహారాత్రి సందర్భంగా క్వారీ తిరునాళ్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా ఆదేశించారు. వడ్లమూడి క్వారీ తిరునాళ్ల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ అధికారుల కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. భక్తుల అభిషేకాలు, దర్శనాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, ఎలక్ట్రికల్ ప్రభల బరువు, సామర్థ్యం, ఎత్తు, ట్రాఫిక్ నియంత్రణ, వెహికల్స్ పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ శ్రీ బాల కోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అధికారులను శాఖల వారీగా విడిది స్టాల్స్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులు పాటు వైభవంగా మహాశివరాత్రి వేడుకలు జరుగుతాయని, ఈ వేడుకల్లో మొదటిరోజు పశువుల ప్రదక్షిణలు ఉంటాయని, రెండో రోజు వాహనాల ప్రదక్షిణలు పూజలు ఉంటాయని, మూడవరోజు ఈనెల 26వ భక్తుల అభిషేకాలు మహాశివరాత్రి వేడుకలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కె.శ్రీనివాసశర్మ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.ఉమాదేవి, ఈఓపీఆర్డీ టి.ఉషారాణి, ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు, తిరునాళ్ల కమిటీ చైర్మన్ జి.శ్రీకాంత్, 52 శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి



మాట్లాడుతున్న శ్రావణ్ బాబు

**తాడికొండ:** చిన్నారులకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అందించే టీకాలు సకాలంలో వేయించేలా సిబ్బంది చొరవ తీసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు అన్నారు. సోమవారం తుళ్లూరు పీహెచ్‌సీని సందర్శించిన ఆయన వైద్య బృందంతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు బిడ్డ పుట్టిన దగ్గర నుంచి ఏఏ టీకాలు ఏ సమయంలో వేయించాలి అనే విషయంపై స్పష్టంగా అవగాహన కల్పించాలని కోరారు. టీకాలకు సంబంధించిన సమాచారాన్ని యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని వివరించారు. గ్రామాల్లో సీడీఎన్‌సీ సర్వే చేసి ప్రతి గ్రామంలోని కుటుంబాలకు ఐడీ నంబర్లు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.శ్రీనివాస్, వసుంధర, శివపార్వతీ, సీహెచ్‌ఓ వెంకట రమణ, ఎంఎస్ రాణి, పర్యవేక్షకులు సుధాకర్, డీఎస్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కరీమ్ పాల్గొన్నారు.

## హనుమత్ వైభవం చాలా గొప్పది



**తెనాలి:** హనుమత్ వైభవం చాలా గొప్పదని, వాస్తవానికి భవిష్యత్ బ్రహ్మ ఆంజనేయస్వామిగా పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి(బాలస్వామి) అన్నారు. స్థానిక షరాఫ్‌బజారులోని శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవాలయాన్ని బాలస్వామి సోమవారం దర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. తన బాల్యంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంతో అనుబంధాన్ని గుర్తుచేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. హనుమంతుడి ధ్వజం ఎక్కడైతే ఉంటుందో అక్కడ జయాలు ఉంటాయని చెప్పారు. హనుమాన్ చాలీసా కూడా జయహనుమతోనే ప్రారంభమవుతుందని గుర్తుచేశారు. మాఘ మాసంతో సహా ఏ మాసంలో ఏరోజు ఏమేం చేయాలో? ధర్మ ఆచరణ విధివిధానాలను పెద్దలు చెప్పారనీ, ప్రజలు శాస్త్రప్రకారం ధర్మాన్ని పాటిస్తూ, భగవంతుడిని ఆరాధిస్తూ తమ జీవనవిధానాన్ని ఆచరించాలని సూచించారు. బాలస్వామీజీకి ఆలయ ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి, హరిప్రసాద్, ప్రధాన అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్వీ కిరణ్‌కుమార్ స్వాగతం పలికారు. స్వామీజీతో సాలిగ్రామ మఠం కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ, సభ్యులు రాజేశ్వరరావు, ప్రభ రాణి, వరలక్ష్మి, ప్రమీల పాల్గొన్నారు.

## నీతి ఆయోగ్ బృందం తక్కెళ్లపాడు సందర్శన

**పెదకాకాని:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల సద్వినియోగంపై నీతి ఆయోగ్ ప్రతినిధుల బృందం తక్కెళ్లపాడు పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం సందర్శించింది. బృందం సభ్యులు జిష్ణుపాల్, స్వప్నలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సడక్ యోజన, పింఛన్ పంపిణీ, డ్వాక్రా యానిమేటర్లతో మాట్లాడారు. డ్వాక్రా స్వయం సహాయ సంఘాలకు మంజూరు చేసిన నిధుల సద్వినియోగంపై డ్వాక్రా సంఘాల మహిళలతో చర్చించారు. ఈ పథకాలను సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## పసుపు ధరలు

**దుగ్గిరాల:** పసుపు గరిష్ట ధర రూ.9800 పలికింది. దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డుకు సోమవారం 320 బస్తాలు రాగా మొత్తం అమ్మకం జరిగినట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. సరకు కనిష్ట ధర రూ.9600, గరిష్ట ధర రూ.9800, మోడల్ ధర రూ.9800, కాయ కనిష్ట ధర రూ.9,551, గరిష్ట ధర రూ.9700, మోడల్ ధర రూ.9700 పలికినట్లు తెలిపారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



**చీరాల రూరల్:** రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన సోమవారం చీరాల రైల్వే స్టేషన్ ఫైరాఫీసు గేటు సమీపంలోని వెంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. ఫైరాఫీసు గేటు సమీపంలో వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో ప్రమాద స్థలాన్ని పరిశీలించగా మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉండవచ్చని, మృతదేహంపై బ్లాక్ కలర్ చొక్కా, గళ్ల లుంగీ ఉందని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ ఎస్సై 94406 27646 కు సమాచారం అందించాలన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ



సీడీపీవో సుచిత్రకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**రేపల్లె రూరల్:** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే.ఝాన్సీ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో ఎం.సుచిత్రకు అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీని వెంటనే అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలన్నారు. కనీస వేతనం రూ.26000 అందించాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్‌ను రూపొందించి అమలు చేయ్యాలన్నారు. సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు అమలు చేయాలన్నారు. సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని కోరారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. సమ్మెకాలంలో చనిపోయిన వారికి సైతం ఇదే విధానాన్ని కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులు వెంటనే ఇవ్వాలని, అన్నియాప్‌లు కలిపి ఒకేయాప్ మార్పు చేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మెనూ చార్జీలు పెంచటంతో పాటు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయ్యాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం మూడు నెలలు ఇవ్వాలన్నారు. ప్రీ స్కూల్ బలోపేతం చేయటంతో పాటు ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్. కృష్ణకుమారి కె.రత్నకుమారి, నిర్మల జ్యోతి, డి.జ్యోతి, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి, సీఐటీయూ నాయకులు కె.వి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

## డాక్టర్ కవితకు అరుదైన అవార్డు



కేంద్ర మంత్రి రామమోహన్ నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ కవిత

**గుంటూరు మెడికల్:** గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి(జీజీహెచ్) గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ ముక్కు కవిత, కేంద్ర మంత్రి కె.రామమోహన్ నాయుడు చేతుల మీదుగా అరుదైన పురస్కారం అందుకున్నారు. టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా హెల్త్ కేర్ అవార్డుల పురస్కారం ఆదివారం వైజాగ్‌లో నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో గణనీయమైన కృషి చేసినందుకు మార్గదర్శకులను గుర్తించి అవార్డులను అందజేస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ భవిష్యత్‌ను రూపొందించడంలో మెరుగైన పాత్ర వహించి గణనీయమైన కృషి చేసినందుకు డాక్టర్ కవితకు అవార్డు లభించింది. అవార్డు అందుకున్న డాక్టర్ కవితకు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారీ, వైద్య కళాశాల, జీజీహెచ్‌కు చెందిన పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది సోమవారం అభినందనలు తెలిపారు.

## కొలిక్కి రాని బంగారం చోరీ కేసు

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ సతీష్ కుమార్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు

**మంగళగిరి:** బంగారం చోరీ కేసు పోలీసు అధికారులకు అంతుచిక్కడం లేదు. రూ.5 కోట్ల అని చెబుతుండడంతో అధికారులు లోతైన విచారణ చేపట్టారు. సోమవారం ఎస్పీ సతీష్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి అధికారులకు దర్యాప్తుపై పలు సూచనలు చేశారు. ఏఎస్పీ రవి కుమార్ నేతృత్వంలో ఫిర్యాదుదారుడు దివి నాగరాజుతో పాటు దుకాణంలో పని చేస్తున్న ఐదుగురు యువకులను రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారిస్తున్నారు. పట్టణానికి చెందిన దివి రాము, విజయవాడలో డీవీఆర్ జ్యూయలరీ దుకాణం నిర్వహిస్తుంటాడు. అందులో మేనేజర్‌గా పనిచేసే దివి నాగరాజు ఈ నెల 15వ తేదీ రాత్రి సుమారు ఐదు కిలోల వివిధ రకాల బంగారు ఆభరణాలను సంచిలో పెట్టుకుని స్కూటీపై వస్తుండగా ఆత్మకూరు బైపాస్‌లోని అండర్ పాస్ వద్ద గుర్తు తెలియని ఇద్దరు యువకులు అడ్డుకుని సంచిని లాక్కుని పారిపోయారని మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. డీఎస్పీ మురళీకృష్ణ నేతృత్వంలో చోరీ జరిగిన తీరుపై ట్రయల్ రన్ నిర్వహించారు. సంచి లాక్కుని వెళ్లిన తీరుపై నిర్వహించిన ట్రయల్ రన్‌లో లాగినా సంచి చేతికి వచ్చే అవకాశం లేదని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. విజయవాడలో ఆభరణాలతో బయల్దేరిన నాగరాజు ఏ మార్గంలో మంగళగిరి చేరుకున్నారనే అంశంపై సీసీ కెమెరాలను పరిశీలించారు. విజయవాడ దుకాణం వద్ద నుంచి కెమెరాలను పరిశీలించిన పోలీసులు 40 ఏళ్ల లోపు వయస్సు ఉన్న ఇద్దరు వ్యక్తులు నాగరాజును వెంబడించినట్లు గుర్తించి వారిని అనుమానిస్తున్న పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. దీంతో అసలు చోరీ జరిగిందా లేదా అనే అంశంతో పాటు చోరీ జరిగిన రోజున దుకాణంలో ఐదు కేజీల బంగారు ఆభరణాలున్నాయా.. ఆభరణాలు తయారు చేయించుకున్న దుకాణదారులు, కస్టమర్లు ఎవరు అనే కోణంలోను దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు.

## ఇస్సోపార్బ్ అధ్యక్షురాలిగా డాక్టర్ సులేఖా పాండే



జ్ఞాపికలు బహూకరిస్తున్న డాక్టర్‌గీతాదేవి

**మంగళగిరి:** ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరినాటాలజీ అండ్ రీ ప్రొడక్ట్ మెడిసన్(ఇస్సోపార్బ్) కొత్త అధ్యక్షురాలిగా డాక్టర్ సులేఖా పాండే బాధ్యతలు స్వీకరించారు. నగర పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో మూడు రోజులు పాటు నిర్వహించిన ఇస్సోపార్బ్ 40వ జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. మూడు రోజులు పాటు నిర్వహించిన సదస్సులో పెరినాటాలజీ, రీ ప్రొడక్ట్ మెడిషన్‌లోని కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. సదస్సును ఇస్సోపార్బ్ విజయవాడ చాప్టర్ నిర్వహించింది. ప్రారంభోత్సవానికి ఇస్సోపార్బ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నారాయణ జానా, కార్యదర్శి డాక్టర్ మిశ్రా చౌదరి, ఎన్టీఆర్‌యూహెచ్ఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి హాజరై అనేక అంశాలను చర్చించారు. చాప్టర్ అధ్యక్షురాలు డాక్టర్ కె.గీతాదేవి, కార్యదర్శి కె.లత ప్రాతినిధ్యం వహించగా 450 మంది ప్రతినిధులు హాజరైన కార్యక్రమంలో పెరినాటాలజీ, రీ ప్రొడక్ట్ మెడిషన్‌లోని పలు అంశాలను చర్చించారు.